క్లుప్తంగా

అర్హులకు దళితబంధు అమలు చేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: దళితబంధు పథకం అర్హులైన దళితులందరికీ అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ప్లకార్డులను ప్రదర్శించారు. దళితబంధు పథకానికి ఎవరు దరఖాస్తు చేసుకోవాలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న దళితబంధు అర్హులకే ఇవ్వాలనే డిమాండ్‌తో కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో దళితహక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మారంపల్లి రవి, నాయకులు మిట్టపల్లి పోలు, మొగిలిలక్ష్మణ్, రాయమల్లు, పొనంగి యోసేపు పాల్గొన్నారు.

తగ్గిన గోదావరి వరద

చెన్నూర్‌రూరల్: ఎగువన కురిసిన భారీ వర్షాల కారణంగా రెండు రోజులు గోదావరి ఉప్పొంగి ప్రవహించింది. పరీవాహక ప్రాంతాలైన మండలంలోని అక్కెపల్లి, చింతలపల్లి, నాగాపూర్, బీరెల్లి, పొక్కూరు, సుందరసాల, నర్సక్కపేట, వెంకంపేట గ్రామాల సమీపాలకు అన్నారం బ్యారేజీ బ్యాక్‌వాటర్ పంట పొలాలను ముంచెత్తింది. గోదావరి వరద శనివారం తగ్గడంతో ఆయా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలి

పాతమంచిర్యాల: వర్షాల వల్ల వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార మార్గాలను చూపించాలని సీపీఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్, ఎన్టీఆర్‌నగర్ ముంపు ప్రాంతాలను నాయకులు శనివారం సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, పీవోడబ్ల్యు, ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, పీవైఎల్, అఖిలభారత రైతుకూలీ సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

జన్నారం: టైగర్‌జోన్ పరిధిలోని పునరావాసం కల్పించే గిరిజన గ్రామాల ప్రజలకు అన్ని వసతులు కల్పించాకే తరలించాలని టీపీసీసీ ఆదివాసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పురక బాపురావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, టీపీసీసీ ఆదివాసీ సంఘం నియోజకవర్గ నాయకులు సునీల్ జాదవ్, నాయకులు నందునాయక్, భాగ్యరావు, వసీం, మహేశ్, రోహిదాస్, నీరాజ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిల్చొని నిరసన

పాతమంచిర్యాల: పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో 5రోజులుగా జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టిన స్వీపర్లు శనివారం ఒంటికాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. తమకు కనీస వేతనం ప్రకటించాలని, ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం నాయకులు వెంకటేష్, గంగన్న, వెంకటేష్, లింగన్న, పద్మ, గంగమ్మ, రాజమ్మ ఉన్నారు.

వరద.. బురద

- జిల్లా కేంద్రంలో తగ్గిన వరదతాకిడి
- ఇళ్లల్లో పేరుకుపోయిన బురద
- తొలగించేందుకు బాధితుల నానా అవస్థలు
- పాడైన ఫర్నిచర్, నిత్యావసర సరుకులు



ఎన్టీఆర్‌నగర్‌లో ఇళ్ల నుంచి బయటకు తీసిన బురద



ఎన్టీఆర్‌నగర్‌లో బురద తొలగిస్తున్న బాధితులు



రాంనగర్‌లో బురదగా మారిన ఇల్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రాన్ని చుట్టుముట్టిన వరద ఎట్టకేలకు శుక్రవారం రాత్రికి పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో, బాధితులు అర్ధరాత్రి నుంచే ఇళ్లలోని బురదను తొలగించుకునే పనిలో నిమగ్నమయ్యారు. గోదావరి, రాళ్లవాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, పద్మశాలీ కాలనీలోని కొన్ని ఇళ్లు వరద నీటిలో మునిగిపోగా, లోతట్టు ప్రాంతాలకు వరదనీరు పెద్ద ఎత్తున వచ్చి చేరింది. నీటితో పాటు చెత్తా చెదారం, బురద కూడా వచ్చి చేరింది. కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినా పలువురి బోర్‌వెల్‌లోకి బురద నీరు చేరి, అవి పనిచేయని పరిస్థితి నెలకొంది. బురదను తొలగించుకునేందుకు నీరు లేక ముంపు బాధితులు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ నుంచి ట్యాంకర్లను తెప్పించి, ఇంట్లో పేరుకుపోయిన బురదను, చెత్తను తొలగించి ఇంటిని శుభ్ర పరుచుకోగా, ఇంట్లోని వస్తువులు పూర్తిగా వరదనీటిలో తడిసిపోయాయి. ఇంటి పైన స్థలం ఉన్న వారు విలువైన వస్తువులు, ఫర్నిచర్‌ను ముందుగానే సర్దుకోగా, స్థలం లేని వారు, ఇతర చోటుకు తరలించలేని వారు ఇంట్లోనే వదిలేసి తాళాలు వేసి వెళ్లిపోగా, వరద నీటిలో అవి మునిగిపోయి, నష్టాన్ని మిగిల్చాయి. ఇంట్లోని వస్తువులు నీటిలో తేలియాడగా, వరదనీరు పోగానే చిందరవందరగా వస్తువులు కిందపడ్డాయి. ఇళ్లల్లోని వస్తువులతో పాటు, ఫర్నిచర్, ఫ్రిజ్‌లు, టీవీలు, వాషింగ్ మెషిన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్లు పాడుకాగా ఇతర వస్తువులు పనికిరాకుండా పోయాయి. కాలనీల్లోని రోడ్లు మొత్తం బురద, చెత్తతో నిండిపోయి, నడిచేందుకు వీలులేకుండా మారగా, మున్సిపల్ ఆధ్వర్యంలో చెత్తను తొలగిస్తూ, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. రోజు కూలీ పనులు చేసుకునే వారి ఇంటి సామగ్రి పూర్తిగా తడిసిపోయి పాడవడంతో, కన్నీరుమున్నీరుగా విలపించారు. వండుకునేందుకు ఉంచిన బియ్యం, పప్పులు, వంట సామగ్రి వరదనీటిలో మునిగి నష్టాన్ని మిగిల్చింది. వరదచేసిన నష్టం ఎంత మేర ఉంటుందో అంచనా వేయలేని పరిస్థితి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది.

ఏటా నష్టమే



బైక్ మెకానిక్‌గా రాంనగర్‌లో ఉండి ఉపాధి పొందుతున్నాను. మూడేళ్లుగా వర్షాలు, వరదలతో షాపు మునిగిపోతుంది. మూడేళ్ల వరదతో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. షాపులోని సామగ్రి వరదల్లోనే ఉండడం, రిపేర్‌కు వచ్చిన బైక్‌లు సైతం వరదలో మునిగిపోవడంతో నష్టం వస్తోంది. షాపులోని కొన్ని సామన్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి.

– అశోక్, బైక్ మెకానిక్, రాంనగర్

వస్తువులు పాడైనయ్



ఇంట్లోకి వరదనీటితో పాటు బురద, చెత్తా చెదారం వచ్చింది. వస్తువులు అన్ని పాడైనయ్. ఇంట్లో పేరుకుపోయిన బురదను తొలగించడం ఇబ్బందిగా ఉంది. ఇల్లు మొత్తం దుర్వాసన, బురద పేరుకుపోవడం, వస్తువులు పాడవడం, ఆస్తి నష్టం జరగడంతో ఏమి చేయాలో తోచడంలేదు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేలా చూడాలి.

– కోట సులోచన, ఎన్టీఆర్ నగర్ కాలనీ

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఏటా వరదలతో నష్టం వస్తుంది. రాళ్లవాగుకు మా ఇళ్లు దగ్గరగా ఉండడంతో వరద కొంచెం వచ్చినా, ఇంట్లోకి వరద వచ్చి, ఇంటికి తాళం వేసి వెళ్లాల్సి వస్తోంది. బట్టలు, కొంచెం సామగ్రిని తీసుకుని వెళ్లడం వల్ల అవి మాత్రమే మిగులుతున్నాయి. ఇంట్లోని సామగ్రి పూర్తిగా వరదలో ఉండడంతో, దానిని ఆరబెట్టుకుని వాడుకోవాల్సి వస్తోంది.

– బొత్తుల దుర్గమ్మ, ఎన్టీఆర్‌నగర్ కాలనీ

బొగ్గుబాయి వార్తలు

'పిల్లలకు సకాలంలో టీకాలు ఇప్పించండి'



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

నస్పూర్: పలు వ్యాధుల నివారణకు పిల్లలకు సకాలంలో క్రమం తప్పకుండా టీకాలు ఇప్పించాలని హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ తెలిపారు. పట్టణ పరిధిలోని అరుణక్కనగర్, ఆర్కే 6, కృష్ణా కాలనీ ఉప కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల డివిజన్ వైద్య ఆరోగ్య అధికారులు పర్యవేక్షించారు. వ్యాధి నిరోధక టీకాలపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి గుండేటి నాందేవ్, ఏఎన్‌ఎంలు స్వాతి, దయమణి, రజిత, త్రివేణి, రమాదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కే 1ఏ గని ఏఐటీయూసీ ఫిట్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఫిట్ కార్యదర్శిగా సురమల్ల వినయ్, ఫిట్ ఉపాధ్యక్షుడిగా గాజుల రాయమల్లుతో పాటు మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు యూనియన్ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ తెలిపారు.

నూతన కమిటీకి సన్మానం

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కెన్నడీ, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్‌ను జేసీఐ సభ్యులు ఘనంగా సన్మానించారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత



జన్నారం: ర్యాలీ తీస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చెన్నూర్: ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు



నెన్నెలలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

నెన్నెల: పులులు, అడవుల రక్షణ అందరి బాధ్యత అని కుశ్నపల్లి రేంజ్ అధికారి గోవింద్‌చంద్‌సర్దార్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం నెన్నెల ప్రజలకు, హాస్టల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పులులను, అడవులను రక్షించాలని నినాదాలు చేస్తూ హాస్టల్ విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పులుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. పులులను కాపాడుట అంటే అడవులను, అందులోని జీవరాసులను, జీవవైవిధ్యాన్ని కాపాడటమే అన్నారు. ప్రజలు సహకరిస్తేనే పులులకు మనుగడ, అడవి అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, శిక్షణ ఆఫీసర్లు మల్లయ్య, రాజేష్, బీట్ ఆఫీసర్ రజిని పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

చెన్నూర్: పులుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎఫ్‌డీవో రమేశ్ అన్నారు. ఫారెస్ట్ అధికారులు చెన్నూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి ఎఫ్ఆర్వోలు శివకుమార్, ఇక్బాల్, రవి, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

జన్నారం: పులులు ఎక్కడుంటే అక్కడ వాతావరణం సమతుల్యత ఏర్పడుతుందని, పులుల సంరక్షణ అందరి బాధ్యత అని జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, రత్నాకర్‌రావు పేర్కొన్నారు. జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలో విద్యార్థులు, అటవీ అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్ కార్యాలయం నుంచి నర్సరీ వరకు ర్యాలీ తీశారు. అనంతరం ఈసీలో పులుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు సినిమా చూపించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజొద్దీన్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, డిప్యూటీ రేంజ్ అధికారులు శ్రీరాం, తిరుపతి, డివిజన్ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంటల నష్టంపై సర్వే చేపట్టాలి



రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

జైపూర్: భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల నష్టంపై తక్షణం సర్వే చేపట్టి, పరిహారం అందించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ మండలం వేలాల గ్రామంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలు, గోదావరి తీరంలో నీట మునిగిన పంట పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి తీర పంట పొలాలు ఏటా ముంపునకు గురవుతున్నాయని, భారీ వర్షాలతో ఇళ్లల్లోకి సైతం నీళ్లు వచ్చి ప్రజలకు తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు. తక్షణం కాళేశ్వరం ప్రాజెక్టు ముంపు రైతులకు, బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఆయనతో బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి డేగ నగేశ్, మండల అధ్యక్షులు చల్ల విశ్వంభర్ రెడ్డి, నాయకుల ఏసయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జైపూర్/చెన్నూర్‌రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన కిష్టంపేట ఉపసర్పంచ్ కుంభం ముకుంద రెడ్డి కుటుంబ సభ్యులను శనివారం చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్కసుమన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ముకుందరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జైపూర్ మండలం ఇందారం మాజీ సర్పంచ్ జక్కుల వెంకటేశం, రామారావుపేట మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ముదాం రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని ఎమ్మెల్యే బాల్క సుమన్ పరామర్శించారు.

నిరుపేదలకు వరం దళితబంధు

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: నిరుపేద దళితులకు దళితబంధు పథకం వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని పొనకల్, జన్నారం గ్రామ పంచాయతీల్లో శనివారం దళితబంధు పథకం గురించి అవగాహన కల్పించారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆ దిశగా సీఎం పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధిలో దూరంగా ఉన్న గ్రామాలు.. నేడు అభివృద్ధిలో ముందున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, రైతుబంధు సమితి అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, ఎంపీటీసీ రియాజొద్దీన్, ఉప సర్పంచులు శ్రీనివాసగౌడ్, రవి, మార్కెట్ కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, డైరెక్టర్లు జనార్దన్, రజాక్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన దుర్గా భవానీ



రేవంత్‌రెడ్డితో దుర్గాభవానీ

బెల్లంపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని శనివారం బెల్లంపల్లి వాసి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి దుర్గా భవానీ కలిశారు. హైదరాబాద్‌కు వెళ్లిన ఆమె రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజవర్గ రాజకీయ స్థితిగతుల గురించి వివరించారు. పార్టీకోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న వారిని గుర్తించి, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వాలని రేవంత్‌రెడ్డిని కోరారు.

సంక్షిప్త వార్తలు

వరద బాధితులకు పరామర్శ

మంచిర్యాలటౌన్: వరదలకు గురైన పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలోని వరద బాధితులను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజిద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామగిరి బానేశ్, జోగుల సదానందం, వార్డు నాయకులు సురేశ్ పాల్గొన్నారు.

ముంపు కాలనీల సందర్శన

మంచిర్యాలక్రైం: బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు బాధలు తప్పడం లేదని బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు కాదాసి రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా కేంద్రంలోని ముంపు కాలనీల్లో శనివారం బీఎస్పీ నాయకులతో కలసి ఆయన పర్యటించారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి బద్రి శ్రీనివాస్, సీనియర్ నాయకులు సిరికొండ బోస్, రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ప్రజలకు రక్షణ కల్పించాలి

పాతమంచిర్యాల: మణిపూర్‌లో ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో దళిత బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పలిగిరి కనకరాజు, భారత్ బచావో జిల్లా అధ్యక్షులు కనుకుంట మల్లయ్య,సామాజిక న్యాయ వేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు'

నెన్నెల: సంఘవిద్రోహ శక్తులకు, అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దని బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా శనివారం నెన్నెల మండలంలోని కొత్తూర్, పొట్యాల, చిన్నవెంకటాపూర్ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. మావోయిస్టు వారోత్సవాలు ఉన్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నెన్నెల ఎస్సై శ్యాంపటేల్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్, సహకార సంఘం చైర్మన్ మేకల మల్లేష్, సర్పంచ్‌లు శారద, మల్లయ్య పాల్గొన్నారు.

'అనుమతించక పోవడం సరికాదు'

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోకి, విద్యార్థి సంఘాల నాయకులతో పాటు మీడియాను అనుమతించొద్దని, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు తిరుపతి పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'కడెం పై చిన్నచూపు తగదు'

జన్నారం: కడెం ప్రాజెక్టు గత సంవత్సరం ప్రమాదం నుంచి బయట పడిన విషయం తెలుసుకున్న పాలకులు ముందస్తుగా మరమ్మతులు చేయకుండా, చిన్నచూపు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ ఆరోపించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

జన్నారం: మండలంలోని ఇందిరమ్మ కాలనీలో ఇటీవల వర్షాలకు ఇళ్లలో నీరు చేరి ఇబ్బంది పడిన విషయం తెలుసుకుని శనివారం కొట్నాక భీంరావ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాలనీలోని 20కుటుంబాలకు బియ్యం, సరుకులు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



ఇటిక్యాలలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

భీమారం/మంచిర్యాలఅర్బన్/దండేపల్లి/మందమర్రిరూరల్/లక్సెట్టిపేట/నెన్నెల/జన్నారం/నస్పూర్/జైపూర్/చెన్నూర్/రామకృష్ణాపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/బెల్లంపల్లి/తాండూర్: మొహర్రం వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆశుర్‌ఖానాల్లో ప్రతిష్ఠించిన పీరీలతో గ్రామ వీధుల్లో శోభాయాత్ర జరిపారు. హస్సేన్, హుస్సేన్‌లను కొలుస్తూ వారి త్యాగాలను స్మరిస్తూ ఉపవాస దీక్షలతో పీరీలతో ఊరేగింపు జరిపారు. కుల, మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలంతా పీరీలకు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వేళల్లో అందరు పీరీల గుండం వద్దకు చేరి మంటలు వేసుకొని గుండం చుట్టూ డప్పుచప్పుళ్ల మధ్య పాటలుపాడుతూ అసైదులా ఆటలాడారు. కుడుకల దండలు, చక్కెర గుళికల దండలను పీరీలకు సమర్పించి దస్తీ(ఖర్చీఫ్)లను పీరీలకు మొక్కులుగా కట్టారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులు, వాగుల్లో భక్తిశ్రద్ధల మధ్య నిమజ్జనం చేయడంతో గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. పలుచోట్ల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



నెన్నెలలో అగ్నిగుండం దాటుతున్న కర్బలసవారీ



జన్నారం: పీరీలతో నృత్యం చేస్తున్న భక్తులు



హాజీపూర్ మండలం వేంపల్లిలో...



చెన్నూర్‌లో పీరీల శోభాయాత్ర



ఆర్కేపీలో పాల్గొన్న భక్తులు



భీమారంలో పీరీల ఊరేగింపు



దండేపల్లి: ముత్యంపేటలో పీరీల ఊరేగింపు

చర్యలు తీసుకోవాలి

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో ఎస్సీ వర్గానికి చెందిన బాపుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటేశం, అంజన్న, లింగయ్య డిమాండ్ చేశారు.